దీపావళినాడు

శ్రీమతి కపులిగ లక్ష్మీబాయమ్మగారు

౧

"ఇదిగో. మిమ్మల్నే. అబ్బ! యీపాటికిలేద్దురూ" అంది సావిత్రి భర్తనులేపుతూ.

"..........."

"లేవరుటండీ...చాలాపన్లున్నాయండీ!"

"ఊఁక్షరే ఒహటే అల్లరి.—కాస్సేపైనా పడుకోనియ్యవ్." అన్నాడు ప్రకాశరావు ముసుగుతీస్తూ.

"మీపడక్కి రోజూఅడ్డమొస్తున్నట్టు...రోజూ లేపుతున్నానా?...ఇవ్వాళ కాస్త పనుందిగదా అని పండగరోజాయను. వాళ్ళపిల్లలుచూడండి ఎలాఆడుకుంటున్నారో పొద్దున్నే లేచి."

"నన్నూ ఆడుకోమన్నావేంటి?"

"ఆడుకోండి. తప్పేంటి?"

"ఆ...యిహ అదొక్కటేఉండిపోయింది. మాఅమ్మవింటే ఏంజేస్తుందో తెలుసా నువ్వు నన్ను ఆక్షేపిస్తున్నావని."

"లేవకుండానే కబుర్లుచెప్తారేం? అదిగో మీఅమ్మపిలుస్తున్నారు. వినబడుతోందా? త్వరగాలేచొద్దురూ. చిన్నబ్బాయిని బతిమిలాడినట్లు బతిమిలాడాలీ."

"ఆ బతిమిలాడొద్దూ? మాఅమ్మకు నేను చిన్నబ్బాయినికానూమరి."

"సరే, బతిమిలాడవలసివచ్చినప్పుడు బతిమిలాడతాన్లెండి...లేవరుగదూ?"

"నాకిప్పుడు నీళ్ళేమిటి? నీకేంమతిపోయిందా. ఏమిటి?"

"అయ్యో! అలాఅంటారేమిటి? పండగరోజుగదూ? మీరుపోసుకోకపోతే నేనూపోసుకోనూ. రారూ?"

"పిచ్చిదానా! నాకెందుకే ముసిలివాణ్ణయాను."

"అప్పుడేముసిలివాళ్ళయారూ యిద్దరుపిల్లల్నికనగానే...మీరేమన్నాసరే యిహతప్పదు."

"ఏమిరా! అబ్బాయి! ఇంకాలేవలేదుగా? నీతరవాత ఎంతమందిపోసుకోవాలోచూడూ." అంటూ కామేశ్వరమ్మవచ్చింది చేతిలోచెంబొకటిపట్టుకొని.

"వాళ్ళందటికి పోశాక నేనూ."

"చిన్నపిల్లల్రా...ప్రొద్దున్నే లేపుతే మారాంపెడతారు. మూడుఘంటలకిలేచాం నేనూ, అదీనీ."

"ముందు దానికి పొయ్యి."

"అలాకాదంటుంది. నీకు పోశాక అదిపోసుకుంటుందిట...కాస్తచలితగ్గాక పోస్తా దానికి."

"ఆహా! దానికిచలిట, నాకుచల్లేదుట, ఇదేపక్షపాతం."

"నీసణుగు...అయ్యో! అప్పుడేనాలుగున్నరయిింది. లే త్వరగా. నేనింకా నీకూ, దానికీపోసి పొయిదగ్గరకెల్లాలి...వడ్డిమంగలాడుగావల్ను తలుపుతట్టున్నాడు...ఆ వస్తున్నా" అని తలుపుతీసివచ్చింది కామేశ్వరమ్మ.

"ఇవ్వాళ పిండివంటేమిటే?"

"ఏమిటో నువ్వే చెప్పు."

"గాంధీ అస్పృశ్యతాఒడంబడికఅయాక ఏంచేశావు?"

"ఏమీలేదూ నాకు ఒంట్లోబాగుండక, అదియింట్లోకిరాక—ఆతర్వాత దశరాకి వాళ్ళింటికేవెళ్ళామా? మరిపీలైందికాదు."

"ఐతేయిప్పుడు...పోనీదాన్నడుగు."

"ఇది బాగుందన్నిటికన్నాను"అంది సావిత్రి తలతిప్పుతూ.

"ఓస్. సిగ్గుపడక. మొన్నమీయింటికివచ్చినప్పుడడగలేదూ నన్ను ఏంచెయ్యమన్నారని."

"చెప్పవే? సిగ్గెందుకు." అంది అత్తగారు.

"నాకేంవద్దు."

"ఏంవద్దూ...అమ్మా! దానికి జిలేబీలిష్టంట. మొన్న చెప్పింది."

"ఓస్, ఆటపా నామీదెందుకూ? మీకిష్టమంటే

చెయ్యరాఏమిటి?"

"ఇదొకరకమైనసిగ్గు. అమ్మా! అవ్వే చెయ్యి."

"ఆ...లే...పద..."

౨

"బాబు! బాబూ! లేఅమ్మా! లే లే చూడూ కళ్ళు తెరు...ఇవిగోనీళ్లురాసుకో బాగాచూడూ."

"ఊఁ" అంటూ రెండోపక్కకితిరిగి పడుకున్నాడు చిట్టి.

"లేవరాబాబు! లే!లే! అమ్మా,లే! బాబువుగదూ, లే. చూడూ అక్కయ్య ఎంచక్కనీళ్లోసుగుంటోంది. ఆ నువ్వెక్కడలేస్తావ్. ఆ అయ్యకొడుకువుగదూ ఒహంతట లేస్తావ్రూ?"

"నాకొడుక్కాదని ఎవరంటూరు." అంటూ వచ్చాడు ప్రకాశరావు.

"అమ్మయ్య! తెమిలారూ...బతికాంబాబూ యింటిల్లిపాదీనీ...మీకొడుక్కాదని ఎవరనగల్రు. రూపురేఖావిలాసాలు గుణాలు అబ్బాయి మూడుమూర్తులూను,...లే,అమ్మా,లే."

"అబ్బ! ఏంటే"

"నీళ్లోసుకోవూమరి. టపాకీలపండగ్గాదూ!"

"నీళ్లొద్దే...టపాకీలుకావాలి."

"నిన్ననువ్వు బాజాలువిన్లేదూ నీళ్లుపోసుకోని వాళ్ళకిటపాకీలివ్వమని."

"ఐతే పద"

"నువ్వు మంచివాడవమ్మా, మీనాన్నలాక్కాదు, మళ్లాపడుకొంటున్నావా?... బామ్మపిలుస్తున్నారు. లే, మరీ."

"అదుగో చిన్నపిల్లత్తో కూడ రిపోర్టే నామీద... ఇదుగో యిలారా."

"చాల్లెండి, వేళాపాళాలేదు...అబ్బ...మీఅమ్మ పిలుస్తున్నారు. పోవాలి...పిల్లాడుకనబట్టంలేదూ? సిగ్గులేకపోతేసరి."

"సిగ్గా?"

"అబ్బ...ఉత్త...య్యా?"

౩

"నాన్నా! టపాకీలునాన్నా!"

"కొంటానమ్మాకొంటా, కాస్తచల్లబడ్డాకవెళ్లితెస్తా"

"మీనాన్న పాపం చాలా అలిసిపోయార్రామరి అవన్నీతిని, అంచాత చల్లబడ్డాక వెళ్తారు."

"నన్నసలు తిన్నిచ్చావు? నేనుతినేస్తే నీకుండవేమోఅని ఒహటేకేకలు తెండితెండని."

"అబ్బో! అసలు నాదాకారానిస్తారూ?" అంది చెయ్యితిప్పుతూ..

"నాన్నా! ఎప్పుడుకొంటావుమరీ."

"చల్లబడ్డాకవెల్తా. సరేగానినీకేంగావాలిచెప్పు."

"నాకా! మరేం నాకేం మరి చీమటపాకీలూ,"

"ఇంకా."

"మరి.,.చిటపటలు"

"నాన్న! వాడు చిటపటలుకాల్చలేడు నాన్న!" అంది కమలం తల్లిఒళ్లోకూర్చొని తాంబోలం వేసుకుంటూ.

"ఆ కాల్చలేనేం పాపం. నేకాలుస్తా,నాన్నా!"

"అవెలాకాలుస్తార్రా? చిట్టీ!"

"అవి ఓస్ నాకుతెలీదుగావుల్సు, దీపానికి ముట్టించిపారేస్తేసరి."

"అమ్మాయి నీకేంగావాలే."

"నాకేంవద్దు" అంది తలతిప్పుతూ.

"నాన్న!అక్కకేం"అన్నాడు చిట్టిఅక్కయ్యకేసి చూసి నవ్వుతూ,

"ఆ ఏంకావాలందిరా? బాబూ!"

"మరేం...అమ్మో కొడుతుందిబాబూ."

"చెప్పమ్మా మరేమీ అందు చెప్పు."

"చెప్పనా మరి. మొగుడుకావాలట."

"నీతో ఎప్పుడుచెప్పిందిరా? ఆ. ఆ. వాణ్ణేవనక. ఊరికే అన్నాడు. చిన్నపిల్లాడుకాదూమరి."

"ఆ.ఊరికేఅన్నాడుపాపం.చూడుతంతానోలేదో"

"పోనీ వాడితోఏంగాని నీకేంగావాలో చెప్పు."

"నాకేంవద్దు"

"కోపంవచ్చిందా ఏం? యిలారా కోపమెందుకూ? ఏంకావాలో చెప్పమరీ."

"తాటాకుటపాకీలు, కాకరపువ్వొత్తులు, మతాబాలు, అగ్గిపెట్టెలు..."

"నాన్నా!నాకూ కావాలి నాన్నా!అగ్గిపెట్లు."

"సరేలే...యింకేంకావలమ్మా."

"ఇంకానా...మరి అక్కడేవుంటే అవి."

"ఒరేయి మీఅమ్మనడగలేదని కోపమొచ్చింది రోయి. నీకేంగావాలోయి" అన్నాడు సావిత్రితో.

"నాకేమక్కర్లేదు."

"ఔను నేనుండగా యివన్నీఎందుకునీకూ?"

"నువ్వెందుకు నాన్నా"!అన్నాడు చిట్టి.

"చాల్లెద్దురూ...సరసం ... ఎవర్నిచూడకుండా మాట్లాడతారేం? చిన్నపిల్లలు, రేపు యివే వాళ్ళకు ఆటలు. ఈకబుర్లే."

"సరేలే. క్షమించు. లెక్చరుతో ధణులెగరగొడుతున్నావు."

"క్షమించడవా యికా!"

"పోనీ శిక్షించు—పంచబాణాలు కావాలా—కాముకుల ఆయుధం నీదగ్గరేఉంది."

"చాల్లెండి యిహకవిత్వంగాబోలు—నాకో ఖద్దరుచీరతెద్దురు చాలు."

"అది సరేలే. కాల్చుకోడానికో."

"నాకేంఒద్దుగాని రంగంటపాకీలు మరచిపోకండేం."

"ఎందుకూ? నామీద ప్రయోగించటానికా?"

౪

"అమ్మాయి! అమ్మనిలాపిలు."

"ఆ—వచ్చారూ-ఒరేయి బసవాయి అబుట్టలోపలికి పట్రారా!" అంది సావిత్రి చేతిలోసగం అల్లుకుంటున్న జడపట్టుకొనివస్తూ.

"ఆ. ఏమిటో చాలాతెచ్చారే."

"ఇదేంటి నాన్నా!"

"ఒరేయి! దూరంగాకూర్చోవాలి. లేకపోతే పేల్తాయి. అంతాదూరంగా కూర్చుంటారు.

"ఇది నీకు—ఇది అక్కయ్యకి...యిదిఅమ్మకు."

"ఆ—నాకెందుకూ?"

"ఓస్ మొహమాటపడక."

"నీకెందు కేమిటి నువ్వుమాత్రం కాల్చుకోవూ?" అందికామేశ్వరమ్మ వత్తులుచేసుకుంటూ.

"అమ్మా! యిందే" అనిపొట్లాం చేతికిస్తున్నాడు ప్రకాశరావు.

"నాకెందుకురా—నీకేంమతిపోయిందా?" అంది పుచ్చుకొంటూ.

"అబ్బ యివికావే. విప్పిచూడూ తెలుస్తుంది."

"ఎంతకొన్నావురా."

"పదిరూపాయిలు—బాగుందా?—మూరా, వెడల్పుచూచుకో."

"ఆ బాగుంది—అదేమిటి?"

"ఇది దొరసానమ్మగారికి."

"ఇదెంత?"

"పదిహేనురూపాయిలు— తమరు ప్యానుచెయ్యండి." అన్నాడు సావిత్రితో.

"ఖద్దరే?" అందిసావిత్రి పరీక్షచేస్తూ.

"ఖద్దరేఅని సంశయంఎందుకు? ఏమాత్రం అనుమానంవేసినా యిచ్చెయ్యనూ? ఖాదీబండారులో కొన్నాను. అటువంటి అనుమానాలక్కర్లేదు."

*　　*　　*

"ఒరేయి! రాత్రి నేను యింటికొచ్చాక భోంచేసి కాల్చుకుందాం. ఏం?"

"అలాగేలే—ఏమేఅక్కయ్యా!"

"ఒరేయి! ఇవికొనకపోతే ఏదోగుడ్డకొని వాళ్లకియ్యరాదూ. డబ్బు కళ్లక్కనబడుతుంది."

"దేశంఅంతా కాలుస్తుంటే వీళ్లూరుకుంటారా? ఏదోపిల్లలు కాలుస్తారు. మనకెందుకూ?"

"అంతా వట్టబద్ధాలత్తా! పిల్లలిపేరూ ఈయన కాల్చటం. నాకుతెలీదు. లేకపోతే యీతూటాలెందుకూ పిల్లల్కి?"

"అవి పక్కింటిరాముడు తెమ్మంటే తెచ్చా. నాకెందుకూఅవి? చెప్పావ్ గడూ. ఉండునీపని. మరి

సమయం రాదూ? అన్నాడు పెళ్లాంతో నింపాదిగా.

"ఆ. నన్నేం చెయ్యగలరు అత్తయ్యదగ్గిరుంటే?"

"మరెప్పుడూ రావు కాబోలు పైకి."

"రానే రాను. ఏంజేస్తారు?"

"ఒరేయి! దానిజోలికెళ్లద్దొనుమా మరి."

"అబ్బే. ఊరికే అంటానుగాని ఎప్పుడైనా ఒక చిన్నదెబ్బ కొట్టానా?"

"ఊఁ. కొట్టలేదు పాపం. ఔను చిన్నదెబ్బ ఎప్పుడూ కొట్టలేదు. పెద్దదెబ్బ కాని కొట్టినప్పుడల్లా!"

"ఎప్పుడు కొట్టానే. ఇంకాపై పెచ్చునువ్వే కొడుతున్నావు నన్ను."

"ఆ — పాపం. నాచేత దెబ్బ తింటేనే యిలా చిక్కిపోయారు."

రాత్రి అందరి భోజనాలూ అయాయి. టపాకీల అడావడిలో పిల్లలు తిన్నగా భోజనం చెయ్యలేదు. అక్కాతమ్ముడు చెరో అరుగుమీదా కూర్చున్నారు ఏమిటేమిటో కాలుస్తూను. తాంబోలం వేసుకొని వచ్చాడు ప్రకాశరావు పిల్లలేంజేస్తున్నారో అని.

"ఒరేయి జాగ్రత్తరోయి — ఉండు నేనొస్తా" అంటూ పిల్లవాణ్ణి తనవొళ్లో కూర్చోబెట్టుకొని కాలుస్తున్నాడు ప్రకాశరావు. లోపల్నుంచి రంగం కాయిలుపట్టుకొని వచ్చింది సావిత్రి. సమయంకని పెట్టి వరసగా పేల్చిం దతనివీపుమీద. రోషంవచ్చింది కాబోలు పిల్లాణ్ణిదింపి తనదగ్గఉన్న కాయలన్నీ పట్టుకొని సావిత్రిని వేటాడుతున్నాడు. అవి తప్పించుకోడానికి ప్రయత్నిస్తోంది సావిత్రి.

"అయ్యో! అదేమిట్రా. టపాకీలతో కొట్టుకుంటారా ఎక్కడైనా?" అంది కామేశ్వరమ్మ తులసికోటదగ్గరున్న దీపాల్లో నూనెపోస్తూ.

"మరేం భయంలేదమ్మా. అవి కాలవు. ఊరికే పేల్తాయి. ఇవి మాలాటివాళ్లకోసమే గాబోలు కనిపెట్టారు" అన్నాడు నవ్వుతూ.

"ఐతే మీయిష్టం. పిల్లలు జాగ్రత్త. దీపావళంటే అసలేభయం బాబూ! నాకూ. కిందటేడు చూశావా పక్కింటి శీతయ్యగాడికేమైందో? ఆగాయంవల్ల చచ్చినంత పనైంది."

"అటువంటివి కాల్చకుండా గవర్నమెంటువారు జాగ్రత్తగాఉన్నారు. ఐనా మనకూ తెలీదూ ప్రమాదమని."

"ఏంజాగ్రత్తో" అంటూ తులసికోటచుట్టూఉన్న దీపాలారిపోకుండా ఎగసనదోస్తూ, పిల్లల్నిఒక్కంట కనిపెడుతూ, కొడుకుతెచ్చిన కొత్తచీరకట్టుకొని "కృష్ణా! రామా!" అంటూ కూర్చొంది ముసలావిడ. సావిత్రి ప్రకాశరావు యింకా వేటలో నేఉన్నట్టుంది.

బుద్ధుఁడు

ఆరవిల్లి నరసింహాచార్యులుగారు బి.ఏ.

తేజంబుగలిగిన ధీశక్తికోలుపడు
ధిషణగల్గిన శౌర్యదీప్తి నాస్తి
శూరతఁగల్గినఁ గ్రూరుఁడై యగడందు
శీలముండిన నల్పజీవియగును
పూర్ణాయువుండిన భూపతిత్వమునున్న
నృపుఁడైన నపుత్రులే రిపులగుదురు
భృత్యులుహితులైన నిల్లాలుజగజంత
దైవోపహతుఁడగుఁ దప్పెనేని
ఇన్నిగల్గినవాఁడు వేయేండ్లకొకఁడు
పుట్టెనేని విరాగియై భూపతిత్వ
ముజ్జగించి వనంబులనుండి సుజన
వందితుండయి తుదిని నిర్వాణమందు.
ప్రాజ్యసామ్రాజ్య, మనుకూలవతియగుసతి
మమతఁబెంచినతండ్రి, నిర్మలులుహితులు,
విశ్వకల్యాణచింత నావేశునాఁగఁ
జాలమికి నీచరిత్రమే సాక్ష్యమొసఁగు
సర్వసర్వంసహాభారసహనచణము
లైనయెగుభుజంబులను ప్రశాంతబాల
మేషవహనంబు సల్పునమేయగుణివి
బుద్ధమూర్తి! యోజగత్ప్రసిద్ధమూర్తి!